"అలాగే నిలిపింది ఉత్కటం"

సువర్ణ

'జ్యోత్స్న'

"ఇయం గేహే లక్ష్మీరియమమృతవర్తిర్నయనయోః,
......................"

అలాగే నిలిపింది వుత్కటం.

విశాలమైన కళ్లను మరింత గొప్పవి చేసుకొని వింటూన్నది సువర్ణ. ప్రశాంతప్రకృతి. కుత్సితులయిన వదినెమరదండ్రు, వెక్కరించు తోడిచెలియలు, భయంకరుడైన భర్త, తృణీకరించు మరది గానరారు. చిన్ననాటి నేస్తకాడు, ప్రియజనకుని ప్రియశిష్యుడు, మరి పెంపు సోదరుని ముఖ్యమిత్రము అయిన పురుషోత్తముని గంభీరకంఠము! పాడుతుండేది తన కత్యంత ప్రీతికరమైన శ్లోకం—ప్రేమనిలయుడైన భర్త ప్రేయసిని కొనియాడడం! నిజమా? అల్లాను జరుగునా, పతులు పత్నుల నంతగా ప్రేమిస్తారా? కథలోనిమాట లని సోద్దెపడేది బేల............

బావిగట్టున వచ్చి నిలిచాడు శాస్త్రి. క్రింద మోహనమూర్తివలె నిలుచున్న సువర్ణనుచూచి నివ్వెరపడాడు. సాంధ్యకృత్యముల దీర్చుకోవచ్చినవాడు—పైరుపంటల పచ్చదనానికి, పిల్లతెమ్మెర్ల చల్లదనానికి హాయి ననుభవిస్తూ అనాలోచితంగానే రాగంలో పడ్డాడు. ప్రేమామృతాన్ని వర్షించేభవభూతికవిశ్లోకాలు ఒకటికరువాయి నొకటిగా పాడుకుంటూ తన్మయుడైయుండిన సమయంలో ఆశ్లోకాన వర్ణించిన సాధ్వీమణివలె తలవనితలపుగా సువర్ణ నక్కడ చూచింది... ఎల్లాగో అయింది శాస్త్రికి. గడిబిడి నడచుకొన్నాడు.

"ఏమమ్మా బావికి ఒంటరిగావచ్చావే, మీ రంగినైనా తోడుకు తీసుకొరాకూడదా? అబ్బో! ఎన్ని గుడ్డలు—ఒక్కర్తవే వుతుకుతున్నావే!"

హఠాత్తుగా శాస్త్రిని చూడడం, వెనువెంటనే అతని అత్యాదరపూరితవాక్యాలు వినడం—సువర్ణకు చెప్పరాని వుద్వేగాన్ని పుట్టించేయి. ఆమె కెరుకలేకనే కన్నీరు మున్నీరుగా కారుతోంది. కన్నీరతని కవుపడనియ్యరాదని మరింత వంగింది చీరగుంజడానికి. అతని పలుకులు అందరూ ఆడేటివేయైనా ఆ సమయాన ఆమె కవి వెలలేనివిగా తోచేయి. తన తమ్ముడు తప్ప తుదకు తలిదండ్రులుకూడా ఇంత అనురాగపూర్వకంగా పలుకరింపరు. వారికి గుండె ఏదీ! ప్రాలుగోడ. ఆదరించి అనుతాపంచూపితే యేమనర్థం కలుగుతుందో! ఈ అత్తింటికాపురం నావల్లకాదని వెన్నంటుతుందేమో! అబ్బో అపనింద! ....
........................మానం ... సువర్ణ తుద కందుకున్నది మాట - భయసంభ్రమానందాల్తో వణుకుతోంది కంఠం "అన్నా, ఆడజన్మాలెత్తి పనిపాట్లకు జంకితే

ఎట్లు......పోనిత్తురుగాని, వూరినుండివచ్చారా? బావ వచ్చాడటనే? లలిత క్షేమమా? నన్నడుగుతుందా! సుఖజీవులు మరచిపోతారు మాలాంటివారిని. .... మావుపేంద్రం శెలవుల్లో రాలేదే- చూచారా అతన్ని?" దైన్యవాక్యాలు. కలతపడింది పురుషోత్తం చిత్తము. అంగవస్త్రంతో ముఖం తుడుచుకొంటూ ఆల్లే యోచిస్తున్నాడు. ఆమెప్రశ్నల కుత్తర మిచ్చుటకూడా మరచాడు. సువర్ణను జడిపించిం దతనిమౌనం. భీతకురంగి మల్లె చూచింది తలయెత్తి. ఇరువురిచూపులూ కలిశాయి ....

"ఏమిటీ! చింతిస్తున్నారేం? అందరూ బాగున్నారుకదా?" ఆమెకుబదు లుత్తరమివ్వక ఆలోచనాయత్తమైన తనబుద్ధిని నిందించుకున్నాడు శాస్త్రి.

"ఆఁ- అందరూ బాగున్నారమ్మ. ఉపేంద్రం రావాల్సనుకొన్నా డీలోపుగానే. కాని శెలవులు దొరకలేదట. వేసవి శెలవుల్లో తప్పక వస్తాడు. ఇంగ్లీషు చదువులు సులభాలు కావు. అవి చదివేవారికి వలసినంత స్వాతంత్ర్యాలుండవు."

అందరి క్షేమవార్తలూ తెలిసింది సువర్ణ కెంతో వుల్లాసమైంది. పురుషోత్తంతో మాట్లాడుతూ, ఆట్లాడుతున్న కాలంవలెనే తోచింది మనస్సుకు. అట్టే గుడ్లుతుకుతూనే బెదరులేని మధురస్వనంతో "పురుషోత్తం, అయిన ఇంగ్లీషు చదువు లంతకష్టమా చదవడం?" అనింది.

"అన్నిచదువులూ కష్టమేగాని నేర్చేరీతిలో వ్యత్యాసముంది. మన చదువులైతే ఒకటితరువాయి నొకటి నేర్చుకొందుము. ఆంగ్లవిద్య అట్లుగాక, ఏడు యెనిమిదిశాస్త్రాలు లోకేసారిచదువాలి—ఒక్కొక్కటీ తలాతోకా తెలియనిదిగా నుంటుంది. అదోవిధమైన కష్టం."

"నీ వెందుకు చదివావుకా వన్నయ్యా ఈ ఇంగ్లీషుచదువు? మీరిరువురూ చిన్నతనంలో నాన్నవద్ద చదువుతూన్నదినాలెట్లుండె! అల్లే, ఇప్పటికీ ఉపేంద్రుడుపాధ్యాయిగానే వుండియుంటే బాగుండె... ఉపేంద్ర మెప్పుడనుకునేవాడు."

ఆ ముగ్ధవాక్యాల కలరిపోయాడు పురుషోత్తం. ప్రియభాషిణి ... ఎదుటివారి కావంతేని నొప్పించని మాటలు.........

"చదివుంటే బాగుండేది. చదువలేదు"......

"ఆ పద్యం మరల చెప్పలేవా అన్నయ్యా? నాకా ఐదారు శ్లోకాలూ-ఎంతోయిష్టం వినడానికి. నాన్న ఉపేంద్రుడు చెప్పిస్తున్నప్పుడు కోటికొస్తుండేది వినివినీ."

శాస్త్రి చెప్పాడా నాలుగైదున్నూ ఎంతో రమ్యంగా. వింటూపరవశఅయింది సువర్ణ

*   *   *

"సువర్ణా, నీవూ నాన్నగారివద్ద ఈ గ్రంథములన్నీ చదవడం నేర్చియుండిన యెంతబాగుండేది! ఉత్తరరామచరిత్రవంటి రసవన్నాటకా లెన్నియున్నవనుకొన్నావు సంస్కృతంలో! ఒక్కొక్కటి చదివినా తన్మయంగా నుంటుంది..............ఏమి, గంప ఎత్తనా? ఒకతే ఎత్తుకొంటున్నావే, భారముకాదూ!" మెట్లుదిగి లోనికివచ్చేడు పురుషోత్తమశాస్త్రి—"అక్కర్లేదు. వద్దు అన్నయ్యా వద్దు. నే నెత్తుకుంటాను. నీ వేమీపట్టవలసింది లేదన్నయ్యా. రోజూ ఎత్తుకోలేదా ఒక్కర్తెనే..." ఎంతవారించినా ఆగాడుకాడు పురుషోత్తం. గంపను తానూ పట్టుకొని సువర్ణనెత్తిన బెట్టాడు. అదెవరు తొంగిచూచింది పైనుండి! సువర్ణ వదినెమరదలు సావిత్రి...

*   *   *

"దాన్నొక్కర్తెనే బావి కెందుకంపారే? సావిత్రిని వెంట పంపకపోయినారా?"

"దానికక్కడా ఆ అక్కరగుండాలె, ప్రాయమాడుది ఒంటరిగాపోరాదని. పిలవరాదేం ఎవర్నయినా, ఇంతమందున్నామే గుండ్రాళ్లలా? గర్వం పొంగిపోతుంటే! ఇంతకు వేల్పులవారింటి పిల్లగాదా దానికేంభయం, కత్తులకవచంతోనే అవతరించింది — మహా పతివ్రత, మావలెనా, మానంమర్యాదలు లేనివారం."

"ఎందు కిన్ని మాటలు? మాటకు పదిమాట్లాడడం ఒక గొప్పపని, పాడుగోల. పోనీ పంపేవన్నయినా మొదులు."

"అవునవును. ముసలిముప్పులో కట్టుకున్నావు వయ్యారిని. ఏంచేస్తుంది? ఏలావుందన్నైనా విచారించు కోవు. మా మాటలు నీ కింతవిసుగు. సావిత్రిని పంపాను లే. నీకన్నా నా కెక్కువగా వున్నదన్నయ్యా కుటుంబ మర్యాద కాపాడుకోవాల్నని. ఇంతకు నీభార్య కేమి తక్కువలే - శాస్త్రులవారింటివారందరికీ - ముఖ్యంగా చిన్నశాస్త్రికి దానిమీద చాలాదయ. ఎప్పుడూ తోడు నీడగా వుంటాడు"

నరసయ్య కోపానలంతో ఉడికిపొయ్యాడు అసలే వృద్ధభర్త కనుమాన మెక్కువ. అందులో కార ణమూ దొరికితే చెప్పడమేం? నాగమ్మ నరసయ్య పెద్ద చెల్లె. విస్తర్లు కుట్టుతున్నది. తాను రగిలించిన నిప్పు చక్కగానే అంటుకుంటోన్నదన్న సంతోషం పైకి కనబడనీకుండటానికి ముఖం ముడుచుకొని మరీ జాగ్రతగా కుట్టుతున్నది విస్తరి. కదురులో జంధ్యాలు తాలుస్తున్నాడు నరసయ్య. చెల్లిమాటలకు మనసు విసిగిం దేమో, గూట్లోకి పారవేశాడు కదురు. అంతలో వచ్చింది సావిత్రి, నరసయ్య కడగొట్టుచెల్లి, వితంతు. "అదేది?" ఏకగ్రీవంగా అడిగా రిద్దరునూ. "వస్తూంది వెనుకాల. చిన్నశాస్త్రి వెంబడేవున్నాడు."

"............ఏమీ? ఏమిటీ?........"

సావిత్రి వేచియుండినదినం వచ్చింది. కోరినకోర్కె నెరవేరింది. లోనిసంతోషాన్ని అణచుకొంటూ "వస్తు న్నదన్నయ్యా పురుషోత్తమశాస్త్రున్నాడంటినే వెనుకాలే"

"నీవెందుకు పొయ్యావుగావే దానివెంబడీ?"

"నన్నది పిలిచిందీ తోడుకురమ్మని? ముసలివా డవు, దానిసంగతి నీకేంతెలుసు మధ్యాహ్నమే వెళ్లింది బావికి ఒకతేను. నేనందే కూర్చున్నా పిలుస్తుందేమో నని-ఎందుకు పిలుస్తుందీ......సంధ్యకావచ్చె రాలేదు. పోయి చూచిరమ్మంది అక్క. పోయి చూచేసరికి... ఇంకేముంది శాస్త్రితో సరసాలాడుతుండె. అతగాడే గంపకూడా ఎత్తి నెత్తిమీ దుంచాడు. అట్టివారంతా తోడుండ - నేనేమిలెక్క నీసహధర్మిణికి!"

తల గిఱ్ఱున తిరిగింది నరసయ్యకు.

"ఏమేమీ శాస్త్రి బావివద్దకు వచ్చాడా?"

సావిత్రి మూతి మూరెడుచేసి "ఊఁ. మరేమి, నన్ను నిందిస్తుంది సువర్ణవదినె. పరాయిమగవాళ్లతో మాటాడుతానని తప్పులు పట్టుతుంది. తాచెడ్డచేట్లకు మందేలేదు."

"విన్నావా అన్నోయి సంగతులెల్లా వుందో! ఇప్పుడైనాచెప్పు బుద్ధి."

అంతలో వచ్చింది సువర్ణ బెదరినలేడిపిల్లలాగు. నెత్తిన మోయలేనంతమోత. చూపులన్నీ కేంద్రీకరిం చాయి ఆమెపైన వివిధాలగా......

"అల్లా దింపుకుంటారు వదినా గంపను......" అరకాలిమంట నెత్తికెక్కింది నాగమ్మకు. "మధ్యాహ్న మీవినయ మెక్కడపోయిందో పతివ్రతాశిరోమణికి! శాస్త్రినే పిలుచుకొని రాకపోయేవా గంపదించుకోను. అంతకన్న పని యేమతనికి."

చిమ్మచీకట్లు క్రమ్మింది సువర్ణకు - వొడలు వణకిపోయింది. అబ్బ, కథ ఎంత కొచ్చింది!! నిష్కల్మష విషయమున ఎంత దుష్టకల్పన, ఏం భయానకమైన కథకట్టా రరక్షణంలో! బాబోయి, ఆ వృద్ధు డేమట్లురుముతున్నాడు! సావిత్రేమిట్లు ముసిముసినవ్వులు నవ్వుతున్నది! ఈ వదినెగారిమాట లేమి! మాటలాయివి! నిశితబాణాలపోట్లుగావా! ఆ తోడిపడుచేమి అంతనిశ్చింతగా ఇల్లంతా తానేయై పారాడుతున్నది! ఏమి, ఏమి, ఎవరిపైన వీరికంతా యింత కోపం - చుట్రుగాలిలో దూసిపోయే చివురాకు కంటే చులగ్గా వడవడవడకుతూ, నెత్తిమీదిబరువు నేల దింపింది. నిలుచోలేకపోయింది. అల్లేగోడ నానుకుంది సువర్ణ..............................

"ఏమిటే, ఆ శాస్త్రితో నీకేంపనే? వాణ్ణెందుకు తీసుకొని పోయ్యావే నూతికి? గొప్పవారింటి పిల్లవు గుణంగా నుంటావని మాటాడించక మర్యాదచేస్తుంటే—ఇదా నీనడత! ఛా, ఛా."

సువర్ణకు చెప్పరాని దుఃఖం, కోపం పొంగుకొచ్చింది. "నానడతలో ఏం కొదువైనది? అనడానికేముంది అపరాధం? నేనేమి, శాస్త్రిని తోడ్కొని పోవడమేమి! ఏంమాటలివి! సంధ్యావార్చను వచ్చాడట. ఇంతకు అత నెంతటియోగ్యుడు! మీ రిల్లాంటిమాటలంటుంటే నేపడ........."వెక్కి వెక్కి ఏడుస్తోంది. అనుకున్నంతమాట ఆడకముందే దుఃఖం కట్టతెంపుకొనొచ్చింది.

"ఈకల్లబొల్లి చేష్టలకే నాకొంది. మాటకు మునుపే ఏడ్పు. భద్రం. బావికి ఇకముందు ఒంటరిగా పోబొయ్యేవు. ఆడది దారితప్పితే వంశాల క ప్రతిష్ఠ - మహాఅప్రతిష్ఠ" అరచాడు ముసలాయన.

"మరిమరి అల్లా అనకండి. ఇందులో దారితప్పడమేమి." అంతలో అడ్డొచ్చింది సావిత్రి. "అదేం వదినా, పరాయి మగవాడు, అతగానిచేత గంప తలపైని కెత్తించుకున్నావు? నేనందే కూర్చున్నానే రవిక కుట్టుకుంటూ. బావికి పోవునప్పుడు నన్ను రమ్మని పిలిచేంత తాలిమి లేకపోయిందే నీకు? చెప్పేనీతులకు మాత్రం అంతేలేదు." తనదుఃఖాల పంట నేడు ఫలితాని కొచ్చినట్లు తోచింది సువర్ణకు. తన దుర్విధికి దిఘాలుపడింది. "రోజూ నిరసించినా సరకుగొనక, తప్పక పిలుస్తుండిన సావిత్రిని నేడేల పిలువకపోతిని! ఆసమయాన ఎన్నడూ రాని పురుషోత్తం నే డెందుకు రావాలి నూతికి? వచ్చినవా డట్లేపోక నిలచాడెందుకు? ఎంత వలదన్నా నాకేల సాయమొచ్చాడు? నే కోరానా...... ఆసమయానికే దుర్దేవత ప్రత్యక్షం కావాల్నా...అయ్యో విధీ! నోట మాటరాక డిల్లపడిపోయింది సువర్ణ. రగులుతున్న కోపం ధగధగమన్నది నరసయ్యకు. లేచి పండ్లుకొరుకుతూ మూలనున్న చేతికట్టె పుచ్చుకొన్నాడు. దబదబా వేశాడు దెబ్బలు సుందర సుకుమార శరీరమువీద. అనటివలె వ్రాలింది నేలను సువర్ణ......

"ఇయం గేహే లక్ష్మి.......అయ్యో—నొప్పి. హా, ఇదేమిజీవితము. కాస్తేని ప్రయోజనంకాన. మెప్పించలేను లోకాన్ని. అయ్యో లోకమంటున్నానేమి? మావదినెల్లో ఒకామెను మెప్పించగలనా? అబ్బా తల యెంతగా నొస్తున్నదోయి భగవంత! ఇంతకంటే పరాభవమా! దుడ్డుకఱ్ఱతో పశువును మల్లె బాదడమా, నిలాపనిందలా! ఈపాడుబ్రతు కెందుకో! మొండికత్తి బ్రతికి యేంసాధింపను! లోకమా లోకమ! నీకం డ్లెంత గ్రుడ్డివి! సత్యమెరుగవే! నావదినెలు తమ ముక్కుకు తిన్నగా చూస్తున్నారు. ఏంలాభము సంపాదింపనో తమలాంటి అబలపై,ఏసుఖమెరుగని నిర్భాగ్యవనితపై... అబ్బా ఏం నింద...ఎంతమాటలు...ఏం పశుత్వము... ఇక దుర్భరము—జీవితమే దుర్భరము—నాలాటికొరతలుండేవారికి తావులేదు భూమిమీద బాబూ...... ఉపేంద్రం ఇంక నిన్ను చూడనూ...? పురుషో...ఆ; ఇక నే నతనిపేరైన యెత్తుకోను. ఇదివరకు మాత్ర మేమిచేశాను! చిన్ననాటి నేస్తకాడను మచ్చికతో చూచినప్పుడు అదీ అతనే పలుకరిస్తే మాటాడేదాన్ని. నామనస్సాక్షికి నేఁ ద్రోహి నెట్లయ్యేది! అదేమి, పురుషోత్తమాన్ని చూస్తే మనస్సుకు యెంతో సంతోష మౌతుండేది! నాన్నా! నాన్న చెప్పతుండిరే 'కాయేనవాచామనసా' కాయేన వాచా, నే నేపాపాలనూచేసియెరుగను... మనసా? అదియే నన్నూరక భయపెట్టుతుండే! అబ్బా- తలనొప్పి...సుంతేనిదయలేక మోదాడే భర్త...నా భర్త...పురుషోత్తం నీవెంత దయానిధివి. నీవైయున్న... అబ్బో నే నే మిట్లైపోతున్నా...భర్తవున్న మరోపురుషుని తలచుటా - పరమపాపము కాదా. కాయేన వాచా శుద్ధురాలను—మనసానూ శుద్ధురాలనే. నాతల్లి తండ్రులు ఏమని న న్నీవృద్ధునికి కట్టబెట్టారు! ఏయాశతో త్రోశారిక్కడికి! నా ఈశరీరమతనిదట...అందుకే ...బాదాడు...అబ్బా యెంతటి స్వతంత్రం! నా మనస్సు? మనస్సతనిది కాదు—మనసుకడ్డేది? నీతి ఒకటే దాన్నడ్డగించేది. నీతి......అందుకే నూయి...

...సావిత్రీ! ఎంతపనిచేసింది సావిత్రి! తెలివిమాలిన పిల్లా, నాలో దోసాలుకల్పించి నీదుర్నయాలను మరుగు చేస్తున్నావా! నిర్భాగ్యురాలా నిన్నని యేంప్రయో జనం......అయ్యో నేనేల నిన్ను తోడుకు పిలువక పోతినీ??......నాన్నా...............ఉష్...

ఒకటే జ్వరం. వళ్లు దగదగా కాగిపోతూన్నది సువర్ణకు. ధాన్యపుకొట్టులో తలుపుచాటున పడుకుంది చీరచెరగు పరచుకొని. పల వరింపులు.........కన్నీటి కాల్వలు......మధ్యమధ్యన యెదుటిగదిలోని సరసాలు వినపడుతోంది.

...గదితలుపు వేసున్నది.

"పలకవేం, కోపమా వేడు కొన్నాకాని? పండుగకు పట్టంచుకోక కొనిపెడతాలే. ఏదీ, ఈలాచూడు. నవ్వు మరీ. అదుగో... అదుగో... అదు గో వచ్చింది నవ్వు."

"చాల్లేండి నేనేమిపసిపిల్లనా ఆలా ఆడించను?"

"పసిపిల్లలు లేరుగదా, నిన్నే ఆడించి ఆముద్దు తీర్చుకుందామని."

"ఎందు కీలా ఆడుతారో, నాకు సిగ్గువేస్తుంది. పోనిత్తురూ, నేపోవాలి."

"నే నల్లాపోనిచ్చేవాడను గాను సుమా. పోనిస్తే ఎందుపోయ్యేవో మీ అక్కలాగే కన్న వాళ్లతో సరసా లాడడానికి. అన్నయ్య కేం తెలియదు. ఆడుదాన్ని చేతిక్రింద నుంచుకోలేనివాడు. ఆమె పోయ్యిందే దోవైంది. సుందరం! నీవల్లాబయటగియట పోబోయ్యేవు సుమా, జాగ్రత్త."

"ఛీ, నన్నెందుకు దాంతో సరిపోలుస్తారుగాని. నాకేం గ్రహచారం కన్నవాళ్లతో సరసాలాడడానికి పోవాలని దేవుడిలా మీరుండగా? ఆడదానికి మొగుడే దైవం. ఇల్లే వైకుంఠం. బయటేం పనీ?" పొంగి పోయ్యాడు వాసుదేవయ్య భార్య పలుకులు విని. ఆమె పాతివ్రత్యానికి మురిసిపోయ్యాడు...

"ఏది, సుందరం......మంచిపిల్లవు. పోయిపనస పండు పట్టుకురా కోతాము. తోనలద్దుకోడానికి నిన్న కాచిన ఆవునెయ్యి తెత్తూ?"



ధాన్యపు కొట్టులో.........చెరగును పరచుకొని

మగని ఆదరణకు మైమరచింది సుందరం. త్రిలో కాలొకటైనా తనతో సమానం కాదనుకొంది. అల్లే కులికిపోతూ వాలునడకతో పోయింది ధాన్యపుకొట్టు లోనికి—పనసపండు తేను. అందు సువర్ణ పడుకుంది. పోయిన ఇక విచారించాలె. దాన్నేమి విచారించడం. సావిత్రిని పంపితెప్పింతామని దొడ్లోకిపోయింది. అదేమి దానిమ్మచెట్టు చాటున...... ఎవరో గుసగుసలు! అల్లే తలుపుచాటు చేరింది సుందరం విందామని. ఒకస్త్రీ, ఒక పురుషుడు. మరేమున్నది! స్త్రీ సావిత్రి. పురు షుడు ఆవూరివైద్యుడు వెంకటప్ప.

"ఏ మింత అపరూపమయ్యావు?"

"ఏంచేయను అక్కగార్లిరువురునూ వచ్చియు న్నారా. మా పెద్దవదినె నీకే తెలుసును—నాపై ఒక కన్నామెకు."

"సరిసరి. ఆమె కేం భయపడడం? ముసలయ్య పెళ్లాం. నీకన్నా కడయని యెంచు. కానీగానీ శెలవుకు

లేదు. ఏంచేయను. ఈ మధ్యా వెనక్కు తీసుకున్నావు ధర్మంచెయ్యిని."

"నావద్దవుంటేగా నీకివ్వడం. వున్న ఆకాస్త పూసాబొట్టు యెటోపోయిందని వదినమీదా, వారిమీదా వీరిమీదా పెట్టి నీకేయిచ్చానే. మరేంలేదు నావద్ద."

"ఏమో చూడు, నీసొట్టు నాచేతనుంది. పాపం యేమో తెలియందని పూరుకున్నా. యెన్నిమార్లు మందులు చేశిచ్చేనో! నీకదంతా మరచేపోయింది. లేకున్నని నన్నీపాటికి కులభ్రష్టను చేసియుండరూ. ఇవన్నీ యెన్నో చూడు. నీ మానం మర్యాదలు నాచేతిలోనివి."

సావిత్రిస్థితి వర్ణనాతీతం! వీనితో విరోధమాడితే నలుగురిలో మానంతీయడం వేరే చెప్పనక్కరలేదు. ఏమైనా కానిమ్మన్న పెద్దన్నదే భయం. తెలిసిన రేపే మడి యిప్పిస్తాడు. ఇంతకువచ్చిందానికేం భయపడడమంటే, ఈ మెత్తని బారెడు వెంట్రుకలు... నిర్మూలించుకోవాలన్నే...!" అట్టేకన్నీటిని జారనియ్యక "ఏంచెయ్యమన్నావు అయితే?" అన్నది. కోరనవ్వునవ్వాడు వెంకటప్ప. "మరేమంటాను, ఖర్చు కేమన్నా తెమ్మన్నాను." సావిత్రి అటుఇటు చూచి, వడిలోనుండి ఏదో తీసిచ్చిందివైద్యునికి. నవ్వుతూ బుగ్గనులిమి వెళ్లిపొయ్యేడు. సావిత్రి దొడ్లోకెళ్లింది.

సుందరం నివ్వెరపోయింది. అమ్మో ఏంసంగతి? ఇంట్లోఅందరన్నివిధాలగా వున్నారే! అదేంచెప్మా సావిత్రి వానికిచ్చింది వడిలోనుండి!

లోనుండి "సుందరం, సుందరం, ఏంవెళ్లేపొయ్యావన్నట్టే—"

"వస్తున్నా."

* * * * *

రాత్రి యెనిమిదిగంటల సమయం. నాగమ్మ కూతురిది నాగరము పోయింది ఒకటేగోల యింట్లో. వెదకి వేసారిపోయింది. సొమ్ము దొరకలేదు. కోపావేగాన నోటికివచ్చినంతా మాట. "ఎట్టిపనులైనా చేసుకోనీ నాకేం. నాబిడ్డసొమ్మే దొంగిలించాలా, దీనిల్లుగుల్లకాను. దొంగిలించకపోతే ఎట్లూ-వి.........ను సంతోషపెట్టడం?"

మరదీ చెల్లీ చేసినమర్యాదలూ, ఇప్పటివదినెగారి దీవనలు, సాయంత్రం భర్తగారిచ్చిన బహుమతులు...

......కత్తితో మోదిన గాయాల్లో నెత్తురుకారుతోన్నది. హృదయంలో పోట్లు పొడుస్తున్నవి. వాతపైకోత - నొప్పిమీదనొప్పి.

* * * * *

మసకు వెలుతురు. నరసయ్య ప్రాతఃకృత్యాలకని పాపయ్యబావికి వచ్చాడు. ఎప్పటివలె గోస్తుతిగాని, గజేంద్రమోక్షంగాని చెప్పుతుండలేదు. ముందునాటి అనాహుతం...అనుకొని కుందుతున్నాడేమొ. పడుచుపెళ్లాంపోకడలు తన కనుమానదాయకాలు, తన నడవడు లామె కనిష్టం. చూచి వెక్కిరించను లోకమొకటి ఇంతకన్నా చింత లేమికావాలె "ఉస్సు, రామచంద్ర." మెల్లిగా దిగుతున్నాడు మెట్లు. ఏమిటదీ! బావిలో నల్లవస్తు వేదో తేల్తున్నది.........పాములూ గీములూ మాట్లాడకూడదే ఈ బావిలో! అదిగో చట్రాతిపై నేదో మెరుస్తున్నది తెల్లగా! పమీ పొసికళ్లాశా. వెండివడ్యాణాం! సువర్ణది.........

ఏమిటదీ! భావిలో తేల్తున్నది.........